క్లుప్తంగా

నేడు ఏర్పేడులో 'సామాజిక తనిఖీ'

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి 17వ విడత సామాజిక తనిఖీని మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు ఎంపీడీఓ సౌభాగ్యం, ఏపీఓ దేవరి మాట్లాడుతూ ఉపాధి పనులపై జనవరి 18 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు వివిధ గ్రామాల్లో జరిగిన సామాజిక తనిఖీలకు సంబంధించిన నివేదికలను వివరించనున్నట్లు వెల్లడించారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్నం రుచికరమైన భోజనం పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని ఎంఈవో మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రదోష పూజలు


నందీశ్వరునికి పూజలు చేస్తున్న అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో వెలసిన పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, నందీశ్వర స్వామికి శ్రీ వాల్మీకేశ్వర స్వామికి ఏక కాలంలో పూజలు చేశారు. ప్రదోష పూజలకు నింద్ర గ్రామానికి చెందిన శ్రీనివాస మిల్క్ డెయిరీ ఎండీ వాసుదేవనాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.లత, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కన్నావరం రోడ్డు


రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

సత్యవేడు: మండలంలోని వీఆర్ కండ్రిగ–కన్నావరం రోడ్డు అధ్వానంగా ఉందని, దానికి మరమ్మతులు పనులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి మెలుగు రమేష్ కోరారు. ఆయన సోమవారం గ్రామస్తులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డులో కంకర తేలడంతో నడిచేందుకు కూడా వీలు కావడం లేదన్నారు. ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. కూటమి నాయకులు కళ్లుండి చూడలేక.. చెవులు ఉండి వినలేనట్లు వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ అధికారులు, నాయకులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కండేయ, మంగయ్య, వరమ్మ, మునెమ్మ, లక్ష్మీగౌరి, శాంత, సరోజమ్మ, మున్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ ఫెస్ట్


ఆటల పోటీల్లో విద్యార్థులు

శ్రీకాళహస్తి: శ్రీరామ్‌నగర్‌కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం ఘనంగా స్పోర్ట్స్ ఫెస్ట్ నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు సైతం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రూపాదేవి మాట్లాడుతూ చిన్నప్పటినుంచే పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, ఆటలపై ఆసక్తి, శారీరక ఉల్లాసం పెంపొందించడం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం సురేష్, ఇన్‌చార్జిలు కల్పన, వాసంతి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


మాట్లాడుతున్న సీఐ వెంకటేశులు

శ్రీకాళహస్తి: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం విద్యార్థులు, ప్రజలకు రెండో పట్టణ పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ వెంకటేశులు మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే లింకుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాటిని పొరబాటున తెరిస్తే ఖాతాల్లో డబ్బులు మాయమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు.

దర్జీ.. ఏదీ నాటి దర్జా?

దుస్తులతో మనిషికి అందం.. హుందాతనం లభిస్తాయి. వస్త్రానికి ఒక ఆకృతిని ఇచ్చి కళాత్మకంగా తీర్చిదిద్దేది దర్జీలు. వారికి ఆదరణ తగ్గింది. మార్కెట్‌లోకి రెడీమేడ్ దుస్తులు విపరీతంగా రావడంతో టైలర్లకు ఉపాధి కరువైంది. గతంలో పండుగలు, శుభకార్యాలు, ఇతర ఫంక్షన్ల సమయంలో చేతి నిండా పనితో బిజీగా ఉండే దర్జీలు నేడు పనులు లేక, కుటుంబాల పోషణ కష్టమై ఇబ్బందులు పడుతున్నారు.

- రెడీమేడ్ రాకతో టైలర్లకు కష్టాలు
- గత ప్రభుత్వ హయాంలో జగనన్న చేదోడుతో భరోసా
- కూటమి ప్రభుత్వంలో మొండిచేయి


వరదయ్యపాళెంలో దుస్తులు కుడుతున్న దర్జీలు (ఫైల్)

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 877 మంది టైలర్లు ఉన్నారు. చిన్న గదుల్లో షాపులను పెట్టుకుని వచ్చే అరకొర దుస్తులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు ఉగాది పండుగ సమయంలో ఇంటిల్లిపాదీ కొత్త బట్టలు తెచ్చుకుని కుట్టించుకునేవారు. నెల ముందు నుంచే టైలర్లకు పని ఎక్కువగా ఉండేది. అన్నం తినే సమయం కూడా ఉండేది కాదు. పండుగ ముగిసిన నెలరోజుల వరకు పని ఉండేది. ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా మారిపోయాయి. బట్టలు కుట్టించుకునే వారు కరువయ్యారు. మార్కెట్‌లో రెడీమేడ్ దుస్తుల దుకాణాలు విపరీతంగా పెరిగిపోయాయి. రోజుకొక ఫ్యాషన్‌తో దుస్తులను ఫ్యాక్టరీల్లో తయారు చేసి విక్రయిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది అప్పటికప్పుడు దుకాణాలకు వెళ్లి తమకు కావాల్సిన దుస్తులను కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పనులు లేక టైలర్లు ఆ వృత్తిని వదిలేసి ఇతర పనులకు వెళుతున్నారు.

గతంలో ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

కష్టాల్లో నలిగిపోతున్న టైలర్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంది. టైలర్ల కోసం జగనన్న చేదోడు పథకం ప్రవేశపెట్టి ఆర్థిక భరోసా కల్పించింది. ప్రతి టైలర్‌కు ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం చేసింది. తద్వారా సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో జగనన్న చేదోడు పథకం ద్వారా 877 మంది లబ్ధిపొందారు. వారికి ఏడాదికి రూ.87,70,000లను నేరుగా ఖాతాలో జమ చేసేవారు. అంతేకాక ప్రతి విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతలు యూనిఫాం క్లాత్‌ను అందజేసి వాటికి కుట్టు కూలి డబ్బులను తల్లుల ఖాతాల్లో జమ చేసింది. యూనిఫాం ప్రభుత్వం కుట్టించి ఇవ్వకుండా గుడ్డ మాత్రమే ఇవ్వడంతో టైలర్లకు ఉపాధి లభించేది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం టైలర్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. గతంలో మాదిరిగానే విద్యార్థులకు క్లాత్ ఇస్తే కొంతవరకైనా ఉపాధి లభిస్తుందని టైలర్లు అభిప్రాయపడుతున్నారు.

పనులు లేకుండా పోయాయి



రెడీమేడ్ వస్త్రాల రాకతో పనులు లేకుండా పోయాయి. పండుగల సమయంలో కూడా పనులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఇంతకు ముందు పండుగల సమయంలో రాత్రింబవళ్లు పనిచేసే వాళ్లం. భవిష్యత్తులో ఈ వత్తిలో కొనసాగడం కష్టతరంగా మారుతోంది. గత ప్రభుత్వం టైలర్లకు ఇస్తున్న రూ.10 వేలు ఎంతగానో ఉపయోగపడేది. ఇప్పుడు అది కూడా రావడం లేదు.

–వెంకటేష్, టైలర్, వరదయ్యపాళెం మండలం

టైలరింగ్ వృత్తే ఆధారం



టైలరింగ్ పని మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రెడీమేడ్ దుస్తుల రాకతో గుడ్డ కొనుగోలు చేసి కుట్టించుకునే వారి సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ వత్తి రోజురోజుకు ప్రశ్నార్థకంగా మారుతోంది. గత ప్రభుత్వంలా చేతివృత్తిదారులను ఆదుకోవాలి. విద్యార్థులకు యూనిఫాం క్లాత్ ఇస్తే టైలర్లకు కొద్దిరోజుల పని దొరుకుతుంది.

–మహబూబ్ బాషా, టైలర్, నాగలాపురం

రైతులకు విశిష్ట గుర్తింపు నంబర్ తప్పనిసరి

వరదయ్యపాళెం: మండలంలోని రైతులు విశిష్ట గుర్తింపు నంబర్ కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో గౌరి తెలిపారు. ఇందు కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కు అనుసంధానం చేసిన మొబైల్ ఫోన్ తీసుకెళ్లాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు సార్వత్రిక డిజిటల్ గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తాయన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

శ్రీకాళహస్తి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని స్వర్ణముఖి నది వద్ద పురపాలకసంఘ సిబ్బంది సాయంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ మద్యం సీసాలను తొలగించారు. అనంతరం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐ గోపి పాల్గొన్నారు.

వికలాంగ పింఛనుదారులకు పరీక్షలు

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో సోమవారం సామాజిక భద్రత పింఛన్ల లబ్ధిదారులకు పరీక్షలు చేశారు. చంద్రగిరికి చెందిన ఆర్థోపెడిక్ డాక్టర్ పవన్ పరీక్షలు చేశారు. శిబిరాన్ని ఎంపీడీవో చంద్రశేఖర్ పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు వికలాంగులు 150 మందిని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం ఆందోళన


శ్రీకాళహస్తి : నిరసన చేస్తున్న సీపీఐ నేతలు


రేణిగుంటలో..

శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వం హామీ మేరకు నిరుపేదలకు ఇంటి స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. సోమవారం తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మురళి, జనమాల గురవయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పేదలకు పల్లెలో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందించాలని స్పష్టం చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గోపి, శివకుమార్, శ్రీనివాసులు, నరసయ్య పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ఇంటి స్థలాల మంజూరే లక్ష్యంగా రేణిగుంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నేతలు ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేతారి రాధాకృష్ణ, నేతలు వైఎస్ మణి, మోహన్ రెడ్డి, కార్తీక్, రజాక్, మురళి, భాను, సెల్వా, వినయ్, హరి, తరుణ్, రమణ, నాదముని, సుబ్బరాజు పాల్గొన్నారు.

రేణిగుంట(ఏర్పేడు): ఇంటి స్థలాల పంపిణీ డిమాండ్‌తో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసీరాజన్ నేతృత్వంలో ఏర్పేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నేతలు బి. నాగభూషణం, ఆర్ బలరాం, టి.మల్లికార్జున్, రమేష్, అయ్యప్ప, సంజాద్ బీ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: ఇంటి స్థలాలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిరసన

వరదయ్యపాళెం: సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తరుణ్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ కార్యకర్తలు, పేదలతో కలిసి సోమవారం వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.

నులి నివారణే లక్ష్యం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం నులి పురుగుల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు రేణిగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి ఛత్రప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. పలు విద్యాసంస్థల్లోని 21,529 పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

తొట్టంబేడులో..

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని డాక్టర్ సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో నులిపురుగుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు వేశారు.

పాపానాయుడుపేటలో..

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం పాపానాయుడుపేట పీహెచ్‌సీలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డాక్టర్ నాగరాజు, డాక్టర్ మధురిమ మాట్లాడుతూ మొత్తం 4,613 మంది పిల్లలకు గాను 4,195 మందికి మాత్రలు వేసినట్లు వెల్లడించారు. పీహెచ్‌ఎన్ అన్నపూర్ణ, సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, ఏఎన్‌ఎం ఉష, ఆషా వర్కర్లు కవిత, సులోచన పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పిల్లలకు ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాండూరు పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్, ఎంఈఓ కె.రవి, ప్రధానోపాధ్యాయిని భారతి ఆల్‌బెండజోల్ మాత్రలు వేశారు. డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 4,736 మంది విద్యార్థులకు గాను తొలిరోజు 4,710 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఎంపీహెచ్‌ఈవో సుబ్రమణ్యం, ఏఎన్‌ఎంలు మేరి, లతాదేవి, రోస్‌లిన్, లావణ్య, కౌసల్య, షణ్ముగం, మనోహరుడు పాల్గొన్నారు.


రేణిగుంటలో పిల్లలకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి


తొట్టంబేడులో..


పాపానాయుడుపేటలో..


సత్యవేడులో..

బీఎన్ కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని మొత్తం 6,181 మంది విద్యార్థులకు గాను సోమవారం 6,014 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు వైద్యాధికారి విద్యాసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, హెచ్‌ఎం రమణయ్య, సీహెచ్‌ఓ వెంకటేశులు పాల్గొన్నారు.

నారాయణవనం/వరదయ్యపాళెం: నారాయణవనం, వరదయ్యపాళెం మండలాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి దర్శిత్‌రాజు తెలిపారు. డిప్యూటీ డీఈవో ప్రభాకర్‌రాజు, హెచ్‌ఎం శ్రీచంద్ర, డాక్టర్ ఉదయ్‌కుమార్, ఎంఈఓ సరస్వతి, ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, పంచాయతీ ఈవో బసిరెడ్డి, వైద్యాధికారి ద్వైత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఆరోగ్య పర్యవేక్షకులు జయలక్ష్మీ పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజనతో విద్యుత్ బిల్లులకు చెక్

నాగలాపురం: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం సూర్యఘర్ యోజనా పథకానికి దరఖాస్తు చేసుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని నాగలాపురం ట్రాన్స్‌కో ఏడీ రమేష్, ఏసీ విజయమ్మ తెలిపారు. పిచ్చాటూరులోని స్త్రీశక్తి భవనంలో సోమవారం ఏపీఎం చంద్రకళ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బల్క్ వినియోగదారులను గుర్తించి వారికి ఈ పథకాన్ని పరిపూర్ణంగా వర్తింపజేయాలని సంఘమిత్రలను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు సూర్యఘర్ పథకాన్ని ఉచితంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారాలన్నారు. సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను వినియోగించుకుంటే బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. లబ్ధిదారులకు రూ.రెండు లక్షల విలువైన 3 కిలోవాట్ల సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందవచ్చన్నారు. లబ్ధిదారులు 10 శాతం వాటా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈ సుబ్రమణ్యం, సీసీలు నాగేంద్రబాబు, సుబ్రమణ్యం, శశికళ, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ సమస్యపై ఫిర్యాదు

తిరుపతి తుడా: ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రీడింగ్ సిస్టమ్)లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా ఆరోపించారు. సోమవారం ఈ మేరకు రుయా సూపరింటెండ్ రవిప్రభుకు ఫిర్యాదు చేశారు. రాజా మాట్లాడుతూ ఎఫ్‌ఆర్‌ఎస్‌లో సమస్యల కారణంగా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. విధులకు హాజరైనా గైర్హాజరుగా నమోదవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భద్రతా నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్టీసీ ఏడీఎం చిట్టెమ్మ

శ్రీకాళహస్తి: రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ చిట్టెమ్మ స్పష్టం చేశారు. సోమవారం ఆర్టీసీ భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ది స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ రహదారి భద్రతా సూత్రాలు పాటిస్తే సురక్షితంగా ప్రయాణించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జనార్దన్‌రావ్ పవార్, ప్రధానోపాధ్యాయిని విశాల పాల్గొన్నారు.

ఏర్పేడులో..

రేణిగుంట(ఏర్పేడు): ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఏర్పేడు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ఏర్పేడు మండలం బండారుపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం నిర్మలకుమార్ పాల్గొన్నారు.

బాలాజీలో అరుదైన శస్త్రచికిత్స


పేషెంట్‌తో వైద్య బృందం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని శ్రీబాలాజీ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో సోమవారం అరుదైన శస్త్రచికిత్స చేశారు. దేశమ్మ(63) అనే వృద్ధురాలికి అధునాతన పరికరాలలో అతిక్లిష్టమైన వెన్నుపూసకు సంబంధించిన శస్త్ర చికిత్సను కీహోల్ ద్వారా నిర్వహించారు. రాయలసీమలో తొలిసారిగా ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఈ ఆపరేషన్ చేసినట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి తెలిపారు. శస్త్ర చికిత్సను డాక్టర్ మహేష్, డాక్టర్ సంతోష్, డాక్టర్ హర్ష, డాక్టర్ చక్రధర్ చేపట్టారని వెల్లడించారు. డాక్టర్ నవీన్ కుమార్ రెడ్డి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ నరసింహ సహకరించారని వివరించారు.

ప్రారంభం.. గురుపూజోత్సవం


మలయాళ స్వామి పాదుకులకు విశేషాలంకరణ

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు వ్యాసాశ్రమంలో సోమవారం ఘనంగా గురుపూజోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి స్వామి మాట్లాడుతూ గురువులే సమాజ నిర్మాణానికి దిక్సూచి అని వెల్లడించారు. అనంతరం అధిష్టాన మందిరంలో భక్తిశ్రద్ధలతో పాదుకుల పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆశ్రమంలోని కుటీరం నుంచి పాదుకులను భక్తులు, విద్యార్థినుల కోలాట, భజనల నడుమ అధిష్టాన మందిరానికి వేంచేపు చేశారు. వేద పండితుల మంత్రోశ్చరణలతో పాదుకులకు ప్రత్యేక పూజలు జరిపించారు. అన్నదాన సత్రంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.. రాత్రి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో శివరాం స్వామి, విమలానంద స్వామి పాల్గొన్నారు.


కోలాట నృత్యాల నడుమ పాదుకులను తీసుకువస్తున్న పీఠాధిపతి

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో మురళి

సత్యవేడు: రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరని ఏవో మురళీ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయ ఆవరణలో డిజిటల్ గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని రైతులందరికీ గుర్తింపు సంఖ్యతో కూడిన కార్డులు ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయన్నారు. ఇందులో భాగంగా రైతులు రైతు సేవా కేంద్రం(ఆర్‌ఎస్‌కే)లో ఉన్న వ్యవసాయ సహాయకులకు ఆధార్ కార్డు, పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్‌కు లింక్ ఉన్న ఫోన్ నంబరు వివరాలు అందజేయాలని సూచించారు. డిజిటల్ గుర్తింపు కార్డు కలిగిన రైతులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందుతాయన్నారు. ఫిబ్రవరి 26లోపు కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది టి.మురళీ, స్వర్ణ, రుద్రయ్య, పూర్ణచంద్ర పాల్గొన్నారు.

వీఆర్‌ఓ బెదిరింపులపై ఫిర్యాదు


కలెక్టరేట్‌లో ఇనగలూరు వాసులు

రేణిగుంట: వీఆర్‌ఓ బెదిరిస్తున్నారని శ్రీకాళహస్తి మండలం ఇనగలూరుకు చెందిన 50 కుటుంబాలవారు సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌కు ఫిర్యాదు చేశారు. గ్రీవెన్స్‌లో ఈ మేరకు అర్జీ సమర్పించారు. వారు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లుగా గ్రామ సమీపంలోని 150/1, 150/2 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో బంక మట్టి నిల్వ చేసి అక్కడే కుండలు తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం వీఆర్‌ఓ తమను అడ్డుకుంటున్నారని, బంక మట్టిని వెంటనే తొలగించకుంటే జేసీబీతో చదును చేయిస్తానని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిశేషయ్య, సర్పంచ్ చెలికం నాగరాజు రెడ్డి, శివకృష్ణ, ముచ్చేలి బాలకృష్ణ, శంకరయ్య పాల్గొన్నారు.